

ఎమ్మెల్సీ కవితతో మడిపెల్లి సుశీల్‌గౌడ్

## ఎమ్మెల్సీ కవితను కలిసిన సుశీల్‌గౌడ్

కాశీబుగ్గ, జూన్ 15: తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆదివారం హైదరాబాద్‌లో జాగృతి ఉమ్మడి వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి మడిపెల్లి సుశీల్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. జాగృతిని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు మరింత కృషి చేయాలని కవిత అతడికి సూచించారు.

### 17న ధర్నాను విజయవంతం చేయాలి

కాశీబుగ్గ, జూన్ 15: హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఈ నెల 17న నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఇఫ్టు జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ పిలుపునిచ్చారు. కాశీబుగ్గ జంక్షన్‌లో ఆదివారం మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం నిర్వహిస్తున్న హత్యాకాండను ఆపాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రవీణ్, గుడికందుల క్రాంతి, జన్ను కుమార్, రాచర్ల బాలరాజు, వెంకటస్వామి, పాలకుర్తి సత్యనారాయణ, నలిగంటి పాల్, చంద్రమౌళి, రాజేందర్, శ్యామ్, రమేశ్ పాల్గొన్నారు.

### అర్హులందరికీ ఇండ్ల మంజూరుకు కృషి

నల్లబెల్లి, జూన్ 15: అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన మండలంలోని నారక్కపేట, మేడెపల్లి, రాంపూర్, నల్లబెల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. అనంతరం లబ్ధిదారులకు ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

### 'ప్రజలను వంచిస్తున్న ప్రభుత్వం'

వర్ధన్నపేట, జూన్ 15: అబద్ధపు హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను వంచనకు గురిచేస్తున్నదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి విమర్శించారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అర్థంలేని కేసు నమోదు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి కేసులకు ఉద్యమ నేతలు ఏమాత్రం భయపడేది లేదని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక కేసులు నమోదైనా ఏమాత్రం అధైర్య పడకుండా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించారని గుర్తుచేశారు. కేటీఆర్‌కు సంఘీభావం తెలిపేందుకు సోమవారం ఉదయం వర్ధన్నపేట నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, SHAMALA RAMESH @ SAMALA RAMESH S/o Veeraiah, R/o. H.No. 4-17, Kothaguda Village and Mandal, Mahabubabad Dist - 506391 T.G. Changed my name from SHAMALA @ SAMALA RAMESH to SHAMALA RAMESH @ SAMALA RAMESH for all purposes.

WANTED
★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# జోరుగా మట్టి, మొరం దందా

- సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- హస్తం నేతల హవా.. అధికారులు డీలా
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

రాయపర్తి, జూన్ 15: మండలవ్యాప్తంగా మట్టి దొంగలు మళ్లీ రెచ్చిపోతున్నారు. వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా కొనసాగుతున్నది. గతేడాది ఎస్సారెస్పీ జలాల రాకతో చెరువులు, కుంటలు, కాల్వల్లోకి నీళ్లు రావడంతో మట్టి దోపీడీకి తాత్కాలికంగా బ్రేక్ పడింది. ప్రస్తుతం నీళ్లు లేకపోవడంతో అక్రమార్కులు అధికారులను మచ్చిక చేసుకొని మళ్లీ కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని మండలంలో చర్చలు జరుగుతున్నాయి. హస్తం నేతల హవాతో సంబంధిత శాఖల అధికారులు కళ్లు మూసుకుంటున్నారని, దీంతో గ్రామాల్లో రేగడి మట్టి, మొరాన్ని ఇటుక బట్టీలు, ఇండ్ల నిర్మాణాలకు టిప్పర్ల ద్వారా తరలిస్తూ కోట్లాది రూపాయలు దండుకుంటున్నారని మండల ప్రజలు అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పుణ్యామా అని చెరువుల్లో నీళ్లు ఉండడం లేదని, కనీసం మట్టిని కూడా ఉండనివ్వడం లేదని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



కాట్రపల్లిలోని పెద్ద చెరువులో రాగడి మట్టిని తీస్తున్న యంత్రం(ఫైల్)

### అనుమతుల పేరుతో బురిడీ

అధికార పార్టీ నేతలు కూటమిగా ఏర్పడి చెరువుల్లోని నల్లరేగడి మట్టిని వ్యవసాయ భూములకు తరలించేందుకు సదరు రైతుల పట్టాదారు పాస్‌పుస్తకాలను ఇరిగేషన్, మండల రెవెన్యూ అధికారులకు చూపుతూ సీనరేజీ పన్నులు చెల్లించి అనుమతులు పొందుతున్నారు. కానీ, అందుకు భిన్నంగా రాత్రి వేళల్లో భారీ లారీలు, టిప్పర్ల ద్వారా నల్లరేగడి మట్టిని పట్టణ శివారుల్లోని ఇటుక బట్టీలకు తరలిస్తూ కోట్లాది రూపాయలు గడిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా చెరువుల్లో మట్టిని తరలిస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం మీదుగా ఉన్న ఎస్సారెస్పీ స్టేజ్-2 ప్రధాన కాల్వకు ఇరువైపులా ఉన్న సేఫ్టీ వాల్స్ (మొరం గడ్డలు) క్రమక్రమంగా కనుమరుగు అవుతున్నాయి. సేఫ్టీవాల్స్‌ను ఇండ్ల నిర్మాణాలకు తరలిస్తూ పంట భూములుగా మార్చుకుంటున్నారు. మట్టి మాఫియా రెచ్చిపోతునా అధికారులెవరూ కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు ఉన్నాయి.



ఎస్సారెస్పీ సేఫ్టీ వాల్‌ను తొలగించి పంట భూములుగా మార్చుకుంటున్న అక్రమార్కులు

> **మట్టి తవ్వకాలు ఆపాలని చెప్పాం**
>
> కాట్రపల్లి గ్రామంలో రైతుల విజ్ఞప్తి మేరకు నల్లరేగడి మట్టి తవ్వకాల కోసం ఇరిగేషన్ శాఖ నిబంధనలకనుగుణంగా అనుమతులు ఇచ్చాం. గడువు తీరడంతో రేగడి మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశాం. మళ్లీ తవ్వకాలు పునరావృతమైతే కఠిన చర్యలకు సిఫారసు చేస్తాం.
>
> – పోలెపాక కిరణ్‌కుమార్, నీటిపారుదల శాఖ డీఈఈ–రాయపర్తి

## ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు దోపిడీ

- జోరుగా పుస్తకాలు, యూనిఫాం విక్రయాలు
- స్కూళ్లలో కనీస సౌకర్యాలు కరువు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

గిర్మాజీపేట, జూన్ 15: జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలలు, కార్పొరేట్ యాజమాన్యాలు నిబంధనలు అతిక్రమిస్తున్నాయి. తమ స్కూళ్లలోనే పుస్తకాలు కొనుగోలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నారు. పాఠశాలల్లోనే స్టాళ్లు ఏర్పాటు చేశారు. బుక్స్ మాత్రమే కాదు.. యూనిఫాం, టై, బెల్టులు తమ వద్దే కొనాలని హుకుం జారీ చేస్తున్నారు. యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా విద్యతో వ్యాపారం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలను బేఖాతర్ చేస్తున్నా అధికారులు మాత్రం పాఠశాలల వైపు కన్నెత్తి చూడడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### అధిక ఫీజు వసూలు

ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు కంటే ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్న యాజమాన్యాలు.. అందుకు తగ్గట్టుగా వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయనే ఆరోపణలు వినవస్తున్నాయి. కొన్ని పాఠశాలల్లో సామర్థ్యానికి మించి ఇరుకు గదుల్లో 30 నుంచి 50 వరకు విద్యార్థులను కూర్చోబెట్టి పాఠ్యాంశాలు బోధిస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తల్లిదండ్రులు వాపోతున్నారు. అలాగే, వందల మంది విద్యార్థులకు పదుల సంఖ్యలో మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉండడంతో క్యూలో నిలబడాల్సిన దుస్థితి నెలకొంది. ఇక వరంగల్ నగరంతోపాటు నర్సంపేట డివిజన్‌లోని కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలైతే అద్దూ అదుపు లేకుండా ఫీజులు పెట్టి డిజిటల్, స్మార్ట్ క్లాసులు, నీట్, ఐఐటీ ఫౌండేషన్ అంటూ తల్లిదండ్రుల ముక్కు పిండి ఫీజు వసూలు చేస్తున్నారు. పిల్లలకు మాలాంటి పరిస్థితి రావొద్దని కూలీనాలి చేసి ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తే యాజమాన్యాల దోపిడీకి ఫీజులు చెల్లించలేక తల్లిదండ్రులు ఆర్థికంగా చితికిపోతున్నారు. అధిక ఫీజులను నియంత్రించాల్సిన అధికారులు కన్నెత్తి చూడడం లేదని విద్యార్థి సంఘాల నేతలు, తల్లిదండ్రులు బాహాటంగానే ఆరోపిస్తున్నారు.

## ముగిసిన జాతీయస్థాయి నాటక పోటీలు

వరంగల్, జూన్ 15: జిల్లా రంగస్థల ఐక్యవేదిక జాతీయ స్థాయి 2025 నాటక పోటీలు ముగిశాయి. నగరంలోని పోతన విజ్ఞాన పీఠం వేదికగా సాగిన నాటక ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన అమ్మ చెక్కిన బొమ్మ, కిడ్నాప్ నాటికలు ఆకట్టుకున్నాయి. మూడు రోజులపాటు సాగిన నాటక ప్రదర్శనలు ఆలోచింపజేస్తూ ప్రేరణ కలిగించాయి. చివరి రోజు ముఖ్య అతిథిగా హాజరైన ఈగ మల్లేశం మాట్లాడుతూ సమాజంలోని చెడును ఎత్తి చూపుతూ మంచి మార్గంలో పయనించేందుకు దారి చూపేది నాటక కళ అన్నారు. నాటక కళను బతికించుకోవాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందన్నారు. విశిష్ట అతిథి ప్రొఫెసర్ రామచంద్రం మాట్లాడుతూ నాటకాల ద్వారా ప్రజలను చైతన్యం చేస్తున్న రంగస్థల ఐక్య వేదిక సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఐక్య వేదిక అధ్యక్షులు కాజీపేట తిరుమలయ్య, శ్రీరామోజు సుందరమూర్తి, వడ్డేపల్లి నర్సింగరావు, ఎస్ఎస్ఆర్ మూర్తి, కుసుమ సుధాకర్, పొగాకు రాజేశ్వర్‌రావు, శ్రీధరాచార్యులు పాల్గొన్నారు.



అమ్మ చెక్కిన బొమ్మ నాటకంలో ఓ సన్నివేశం

## తల్లిదండ్రుల బాధ్యత కుటుంబ సభ్యులదే..



ర్యాలీ నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులు

గిర్మాజీపేట/చెన్నారావుపేట, జూన్ 15: వృద్ధులైన తల్లిదండ్రుల బాధ్యత కుటుంబ సభ్యులదేనని, వారిని వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధులు హెచ్చరించారు. ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవం సందర్భంగా ఆదివారం అధ్యక్షుడు కొన్‌రెడ్డి మల్లారెడ్డి ఆధ్వర్యంలో కాశీబుగ్గ వివేకానంద కళాశాల మీదుగా ఎల్లమ్మగుడి, గిర్మాజీపేటలోని హైస్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆపద సమయంలో వృద్ధులు సమస్యల కోసం 14567, ఉచిత న్యాయ సహాయం కోసం 15100 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని మల్లారెడ్డి కోరారు. కార్యక్రమంలో సరస్వతి హైస్కూల్ ప్రిన్సిపాల్ మార్తయుగేంధర్‌రావు, సూర్యానారాయణ, తుమ్మ వీరయ్య, నిజాముద్దీన్, భారతి చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఆడెపు రాజేంద్రప్రసాద్, నిమ్మకాయల సదానందం, ఎస్.సత్యనారాయణ, రమేశ్, వీరస్వామి, సోమయ్య, దామోదర్, రవీందర్ పాల్గొన్నారు. అలాగే, చెన్నారావుపేటలో వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ ఆధ్వర్యంలో వృద్ధులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై రాజేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ములుక సాంబయ్య, కోశాధికారి వీ కుమారస్వామి, జే రాంరెడ్డి, టీ కొమ్మాలు, గట్ల కృష్ణ, ముత్యం సాంబయ్య, పత్తి అనంతరెడ్డి, నర్సింహారావు, సిద్ధ కుమారస్వామి పాల్గొన్నారు.

## అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి


- వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్
- శాంతినగర్ కాలనీలో సదస్సు



మాట్లాడుతున్న ఏసీపీ నందిరాంనాయక్

కాశీబుగ్గ, జూన్ 15: దొంగతనాల నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదివారం వరంగల్ 22వ డివిజన్ శాంతినగర్ కాలనీ వెల్ఫేర్ సొసైటీ నేతృత్వంలో సీఐ తుమ్మ గోపి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ హాజరై మాట్లాడుతూ ఇళ్లకు తాళాలు వేసినట్లు బయట కనిపించొద్దన్నారు. ఇంటి ఎదుట కనిపించే న్యూస్ పేపర్, పాల ప్యాకెట్లను బట్టి ఇంటి యజమానులు లేనట్లుగా దొంగలు పసిగడతారన్నారు. తాళం వేసి బయటకెళ్లినా ఇంట్లో ఉన్న వాతావరణం కల్పించాలన్నారు. ఇంట్లో విలువైన బంగారం, డబ్బులు, ఇతర వస్తువులు ఉంచొద్దన్నారు. ఇంటి చుట్టు పక్కల లైట్లు వేసుకోవాలని సూచించారు. అనుమానితులు కనిపిస్తే వెంటనే 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. పతి వీధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మహిళలు ఆభరణాలు ధరించి బయటకు వెళ్తే అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అంతర్రాష్ట్ర దొంగలను పట్టించినందుకు కాలనీవాసులను సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బస్వరాజ్ కుమారస్వామి, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

## వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా దినోత్సవం



రైతును సన్మానిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

వరంగల్‌చౌరస్తా, జూన్ 15: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సంపూర్ణ సేవా దినోత్సవాన్ని ఆదివారం పిన్నవారివీధిలోని వాసవీ భవన్‌లో వరంగల్ అధ్యక్షుడు తొనుపునూరి వీరన్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సిల్వర్ స్టార్ వైస్ ప్రెసిడెంట్ పుల్లూరి ప్రకాశ్, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వల్లాల శైలజ హాజరై రైతులను సన్మానించారు. పిల్లలకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రీజినల్ చైర్మన్ గూడూరు వెంకటనారాయణ, రీజినల్ కార్యదర్శి మెర్గం శ్రీనివాస్, బెలిదె వెంకటేశ్వర్లు, గనున్న సంపత్ పాల్గొన్నారు. అలాగే, భద్రకాళి దేవస్థానం ఆలయ కమిటీ ధర్మకర్తగా నియమితులైన తొనుపునూరి వీరన్నను సత్కరించారు.

### ప్రతిభ అవార్డుల ప్రదానం

వరంగల్: ఎంజీ రోడ్డులోని ఆర్యవైశ్య వాసవీ పరపతి సంఘం ఆధ్వర్యంలో పది, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కార్ అవార్డులను ఆర్యవైశ్య సంఘం నాయకుడు గట్టు మహేశ్ బాబు అందజేశారు. ఈ సందర్భంగా డీఐఈవో శ్రీధర్‌సుమన్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థలు కార్పొరేట్‌కు దీటుగా రాణిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు తోట నవీన్‌కుమార్, ఇరుకుల్ల రమేశ్, ఎలగందుల రమేశ్, కుంచం వీరభద్రరావు, గంగిశెట్టి హరినాథ్, పాలారపు పనేశ్, దివ్వేల శ్రీనివాస్, నీల రాజన్న, ఆకుల సర్వేశ్వర్‌రావు, వెంకటకృష్ణ, శిరుప మాధవ్ పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థినిని సన్మానిస్తున్న అతిథులు

సంగెం, జూన్ 15: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని వ్యాపారవేత్త రావిపాటి వెంకటేశ్వర్‌రావు అన్నారు. సంగెం మండలంలోని పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 200 విద్యార్థులకు ఆదివారం పద్మశాలీ భవన్‌లో కందకట్ల నరహరి అధ్యక్షతన పులి రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కార్ అవార్డులు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కందకట్ల కళావతీ నరహరి, మంగపేట తహసీల్దార్ తోట రవీందర్, ఎస్సై ఎల్.నరేశ్, ప్రొఫెసర్ వాసం శ్రీనివాస్, కాసం చంద్రారెడ్డి, లింగమూర్తి, ఎం.రమేశ్, కోటేశ్వర్, మాజీ ఎంపీటీసీ మల్లయ్య, బొజ్జ సురేశ్, గన్ను సంపత్, రాజు, చందర్‌రావు, రౌతు కోటేశ్వర్, శ్రీనివాస్, మెట్టుపెల్లి కొమురయ్య, పులి శిరీష పాల్గొన్నారు.

### నేడు బల్దియాలో గ్రీవెన్స్

వరంగల్, జూన్ 15: మహా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీవెన్స్‌కు అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆదేశించారు.

## పాలకులకు పారిశుధ్య సమస్యలు పట్టవా?

### ప్రశ్నిస్తున్న మండల ప్రజలు

వర్ధన్నపేట, జూన్ 15: వర్షాకాలం ప్రారంభానికి ముందే ప్రజలు పారిశుధ్య సమస్యలతో సతమతమవుతున్నారు. విషజ్వరాలు, డయేరియా, మలేరియా వంటి విష జ్వరాలు వచ్చే అవకాశం ఉంది. మున్సిపాలిటీ కేంద్రంతోపాటు గ్రామాల్లోనూ పారిశుధ్య సమస్యలు ఉన్నాయి. డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నది. వర్ధన్నపేట పట్టణంలోని 10వ వార్డులో ప్రధాన డ్రైనేజీలో మురుగునీరు ఏడాది కాలంగా నిలిచింది. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు అవస్థలు పడుతున్నారు. పట్టణానికి ఓ పక్క ఆకేరు, మరో పక్క సంగెపు వాగు ఉంది. డ్రైనేజీ నీరు సులువుగా వెళ్లేందుకు సుమారు రూ. 20 కోట్లతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నూతన డ్రైనేజీలు నిర్మించింది. అధికారులు మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో పారిశుధ్య పనులు పడకేశాయి. గ్రామాల్లోని అదేతీరు కనిపిస్తున్నది. అంతర్గత వీధుల్లో ఏర్పడిన గుంతల్లో మొరం పోయించడంతోపాటు కాల్వలను శుభ్రం చేయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఇల్లందలోని 11వ వార్డులో చిరుజల్లులకే రోడ్డుపై నిలిచిన నీరు

10వ వార్డులోని డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం



మామునూరు పోలీస్‌స్టేషన్

## ఇద్దరు ఎస్సైలకు ఒకే వాహనం

- షిఫ్టుల వారీగా వినియోగం
- వాహనాలకు మరమ్మతు కరువు

కరీమాబాద్, జూన్ 15: ప్రస్తుతం మరమ్మతులకు వెళ్లిన పోలీస్ వాహనాలు నెలలు గడుస్తున్నా తిరిగి స్టేషన్‌కు రావడం లేదు. దీంతో ఒకే వాహనంతో సరిపెట్టుకుంటున్నారు. ఇద్దరు ఎస్సైలు ఉన్న పోలీస్‌స్టేషన్‌లో ఒకే వాహనం ఉంది. దాన్ని వారు షిఫ్టుల వారీగా వినియోగిస్తున్నారు. మామునూరు పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు ఎస్సైలు విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఇద్దరికి చెరో వాహనం ఉండేది. మరమ్మతుల కోసం ఓ వాహనాన్ని పోలీస్ హెడ్ క్వార్టర్‌కు పంపారు. నెలలు గడుస్తున్నా వాహనం రాకపోవడంతో ఒకే వాహనాన్ని ఇద్దరు విడతల వారీగా వాడుతున్నారు. మామునూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న విలీన గ్రామాలు స్టేషన్ నుంచి చాలా దూరం ఉంటాయి. బాధితులు వచ్చి ఫిర్యాదు చేస్తే.. ఎస్సై విచారణకు వెళ్లాలంటే వాహనం తప్పనిసరి. అందుబాటులో లేకపోవడంతో కేసుల విచారణ ఆలస్యం అవుతున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు పోలీస్ వాహనాలకు త్వరగా మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## 13,754 కేసుల పరిష్కారం: సీపీ

సుబేదారి, జూన్ 15: లోక్ అదాలత్‌లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 13,754 కేసులు పరిష్కారమైనట్లు సీపీ సన్‌ప్రీత్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల్లో 991 పరిష్కారమయ్యాయి. వాటిలో సెంట్రల్ జోన్‌లో 455 కేసులు, ఈస్ట్‌జోన్‌లో 258 కేసులు, వెస్ట్‌జోన్‌లో 278 కేసులు ఉన్నాయి. మిగతా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కేసులు 5,248, పెట్టి కేసులు 4,701, మోటర్ వెహికల్ కేసులు 2,551 పరిష్కారమయ్యాయి. అలాగే, 263 సైబర్ కేసుల్లో పెండింగ్‌లో ఉన్న రూ. 1,06,52,00కు రూ. 20,81,188 బాధితులకు అందజేశామని ప్రకటనలో పేర్కొన్నారు.

### వరంగల్ సీపీకి గవర్నర్ అవార్డు

వరంగల్ పోలీస్ కమిషనరేట్ నుంచి అత్యధికంగా రక్తదానం చేసినందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్‌కు అవార్డు అందజేశారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో గవర్నర్ చేతులమీదుగా సీపీ హై బ్లడ్ డోనర్ మోటివేటర్ అవార్డు అందుకున్నారు.

### బాల్యమిత్రుల ఆర్థిక సాయం

సంగెం, జూన్ 15: మండలంలోని కుంటపల్లికి చెందిన రాగిరి రాజేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. 2005 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం రాజేందర్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ. 17 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కక్కెర్ల సతీశ్, ఆగపాటి రామకృష్ణ, చిర్ర నరేశ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న బాల్యమిత్రులు



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న చల్లా ధర్మారెడ్డి

## మృతుల కుటుంబాలకు చల్లా పరామర్శ

గీసుగొండ, జూన్ 15: మండలంలోని ఎలుకుర్తికి చెందిన గొర్రె యాదగిరి, శాయంపేట గ్రామానికి చెందిన దాడి కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల కార్యదర్శి చల్లా వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పూండ్రు జైపాల్‌రెడ్డి, బోడకుంట్ల ప్రకాశ్, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు రాజయ్య, చంద్రమౌళి, ధనుంజయ్, రాజు, ప్రమోద్, రాజేందర్, రాజు పాల్గొన్నారు.



మోహన్‌రావుకు నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

## 'దొడ్డ'కు బీఆర్ఎస్ నేతల నివాళి

నర్సంపేట, జూన్ 15: ప్రముఖ పారిశ్రామికవేత్త దొడ్డ మోహన్‌రావు మృతిపై బీఆర్ఎస్ నర్సంపేట డివిజన్ నేతలు సంతాపం ప్రకటించారు. ఈ మేరకు పట్టణకేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద మోహన్‌రావు చిత్రపటానికి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, నాయకులు నల్లా మనోహర్‌రెడ్డి, వేనుముద్దల శ్రీధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు బండి రమేశ్, మండల శ్రీనివాస్, ఎండీ పాషా, పెండె వెంకటేశ్వర్లు, గందె చంద్రమౌళి, పుల్లూరి స్వామిగౌడ్, పెండ్యాల యాదగిరి, అప్పల సుదర్శన్, చుక్క అనిల్, బీరం నాగిరెడ్డి, సంపంగి సాలయ్య, ఐలోని శ్రీను, గిరగాని సాంబయ్యగౌడ్, మునిగాల కళాధర్‌రావు, బగ్గి రాజు, తాబేటి శంకర్ పాల్గొన్నారు.

### తూర్పుకోట సమస్యలు పరిష్కరించాలి

ఖిలావరంగల్, జూన్ 15: వరంగల్ 37వ డివిజన్ తూర్పుకోటలో ఏళ్ల తరబడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎంసీపీఐయూ నగర కార్యదర్శి జగదీశ్వర్ అన్నారు. తూర్పుకోటలో ఆదివారం ఎంసీపీఐయూ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాతికోట తూర్పు ద్వారం నుంచి మట్టి కోట తూర్పు ద్వారం వరకు, యాదవవాడ, పెరికవాడకు వెళ్లే ప్రధాన రహదారులను విస్తరించాలన్నారు. ఇంటింటా చెత్త సేకరణలో నగర పాలక సంస్థ పూర్తిగా విఫలమైందన్నారు. ఇంటింటికీ తాగునీరు సరఫరా చేయాలన్నారు.

### ఎస్సై రాజేందర్‌కు సన్మానం

రాయపర్తి, జూన్ 15: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్సై ముత్యం రాజేందర్‌ను ఆదివారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలు కప్పి సత్కరించారు. ఎస్సైని కలిసిన వారిలో శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడు కుంట హన్మంత్‌యాదవ్, ఉపాధ్యక్షుడు కసిరబోయిన శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చందు సతీశ్‌యాదవ్, కసిరబోయిన రాజు, ధర్మయ్య, కుమార్, బండి లింగయ్య, బక్కతట్ల సాయిలు, మర్రి వెంకటేశం, చందు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ ఒకరి మృతి

కరీమాబాద్, జూన్ 15: చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. ఉర్సు ప్రాంతానికి చెందిన పోలెపాక కుమారస్వామి(55) ఈ నెల 9న ఉర్సు బైపాస్‌రోడ్డులో పెట్రోల్ పైన పోసుకుని నిప్పటించుకున్నాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు అతడిని వెంటనే ఎంజీఎం దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

### పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత

నెక్కొండ, జూన్ 15: సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి రూ. లక్ష విలువైన ఐదు సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించినట్లు ఆదివారం ఎస్సై మహేందర్ తెలిపారు. నెక్కొండకు చెందిన ఈదునూరి దిలీప్, రాపాక కట్టయ్య, గేట్‌పల్లికి చెందిన మూడు విజయ్‌కుమార్, రెడ్లవాడకు చెందిన మేడి రాజు, రావు వినయ్‌కి మొబైళ్లు అప్పగించారు.

### విద్యుత్ అధికారుల సెల్ నంబర్లు ఇవే..

దుగ్గొండి, జూన్ 15: మండలంలోని విద్యుత్ వినియోగదారులు, రైతులు సమస్యలు, సమాచారం కోసం విద్యుత్ అధికారులను ఈ కింది నంబర్లలో సంప్రదించాలని ఏఈ ప్రత్యూష కోరారు. రేఖంపల్లి ఏఈ 8712484841, అడవి రంగాపురం సబ్‌స్టేషన్ 8712484842, గిర్నిబావి సబ్‌స్టేషన్ 8712484844, తిమ్మంపేట సబ్ సెక్షన్ 8712484843, ఏఈ రామ్మూర్తి 8712484839, దుగ్గొండి సబ్‌స్టేషన్ 87124484840, కేశవపురం సెక్షన్ 8712484838 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కరీమాబాద్/ఖానాపురం, జూన్ 15: నిత్యం పోలీస్ పరేడ్, ఫైరింగ్ ప్రాక్టీస్‌తో గంభీరంగా కనిపించే మామునూరు బెటాలియన్ ఆదివారం ఆత్మీయ పలకరింపులతో ప్రశాంతంగా కనిపించింది. మామునూరు బెటాలియన్‌లోని ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో 1994–1995 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళం నిర్వహించారు. 30 ఏళ్లనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమ బ్యాచ్ నుంచి బీఎస్ఎఫ్‌లో సేవలు అందిస్తున్న రేగొండ రాకేశ్‌ను సత్కరించారు. అలాగే, ఖానాపురం మండలం పాకాలలో మహబూబాబాద్ జిల్లా కొత్తగూడెం మండలం సాదిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్ 1996–97 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు 28 ఏళ్ల తర్వాత కలుసుకొని తీపిగుర్తులను నెమరువేసుకొని మురిసిపోయారు.



కరీమాబాద్: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

## విరిగిన పోల్.. పొంచి ఉన్న ప్రమాదం

నర్సంపేట, జూన్ 15: పట్టణ శివారులోని కాకతీయనగర్ శివారు నర్సంపేట–నెక్కొండ ప్రధాన రహదారి పక్కన విద్యుత్ సపోర్టు పోల్ విరిగి ప్రమాదకరంగా మారింది. ఈ స్తంభం కిందనే వ్యవసాయ పొలాలు ఉన్నాయి. అదేవిధంగా పెద్ద చెట్లు కూడా ఈ పోల్‌కు దగ్గర్లోనే ఉన్నాయి. వాహనదారుల రాకపోకలు కూడా ఎక్కువ మొత్తంలో సాగిస్తుంటారు. సపోర్టు పోల్ విరిగి చాలా రోజులు అవుతున్నదని, విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రమాదం జరగకముందే స్తంభాన్ని మార్చాలని ప్రజలు కోరుతున్నారు.



నర్సంపేట–నెక్కొండ ప్రధాన రహదారి పక్కన విరిగిన స్తంభానికి సపోర్టుగా ఏర్పాటు చేసిన పోల్